## క్లుప్తంగా

### కంటి వెలుగు శిబిరం తనిఖీ

నవీపేట: నవీపేటతో పాటు అభంగపట్నం గ్రామంలోని కంటి వెలుగు శిబిరాలను కంటి వెలుగు క్వాలిటీ మేనేజర్ స్వప్న గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల వివరాలను తెలుసుకుని, వారికి అందించిన సేవలను పరిశీలించారు.

**భీమ్‌గల్‌లో..**

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని రెండో వార్డు, బాబాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి వెంకటేష్, ఫార్మసీ సూపర్‌వైజర్ నారాయణలు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, అవసరమైన ప్రతి ఒక్కరికి కంటి అద్దాలు ఇవ్వాలని, అలాగే అవసరమైన వారిని ఆపరేషన్‌కు పంపించాలని వారు సూచించారు.

### భవన పనుల పరిశీలన

రుద్రూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల ప్రభుత్వ కార్యాలయాల(కాంప్లెక్స్) భవనాన్ని గురువారం జెడ్పీటీసీ నారోజి గంగారాం, మండల అభివృద్ధి అధికారి బాలగంగాధర్ పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తహసీల్, మండల పరిషత్ తదితర కార్యాలయాలు ఇందులోనే ఉంటాయని, ఇందుకోసం అదనంగా రూ.30 లక్షల కోసం ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు.

### 'పాఠశాల అభివృద్ధికి కృషి'



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఎస్ఎంసీ, వీడీసీ సభ్యులను గురువారం ఎంఈవో రాజ గంగారాం ఆధ్వర్యంలో సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో వంటశాల, మూత్రశాలల నిర్మాణంతో పాటు రక్షిత జలాలు అందజేయడానికి వాటర్ ప్లాంటును ఆయన ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలకు రంగుల వేయించారు. ఇందుకు కృతజ్ఞతగా వారిని సన్మానించారు. మాజీ సర్పంచ్ గణేష్, సొసైటీ మాజీ చైర్మన్ ముత్యం రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎల్‌వోసీ అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన ఎస్ నడ్పి గంగారాంకు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గురువారం హైదరాబాద్‌లో రూ.2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. గంగారాం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, సీఎం సహాయ నిధి నుంచి ఆయనకు డబ్బులు మంజూరు చేయించి, సంభందిత చెక్కును గంగారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

### కరప్రతాల ఆవిష్కరణ

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 14న తలపెట్టిన చలో ఇందిరా పార్క్‌కు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో గల బాబు జగ్జీవన్ రాం విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, పట్టణ అధ్యక్షులు అద్దంకి లింగయ్య, పట్టణ ఇన్‌చార్జి గుంజరి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌టీపీ నేతకు నివాళి



బోధన్: పట్టణ కేంద్రానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకుడు చెన్నారెడ్డి(62) బుధవారం సాయంత్రం గుండె పోటుతో మృతిచెందాడు. గురువారం బోధన్‌లో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ యూనుస్, వివిధ మండలాల ముఖ్య నాయకులు పోతరాజు మదన్, గంగామణి , సైదులు అంత్యక్రియలకు హాజరయ్యారు. చెన్నారెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.

### రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి

బోధన్‌టౌన్(బోధన్): కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు రూ.5 పింఛన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేసే బిల్లును రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షులు మీర్ నజీర్ అలీ కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ పిలుపు మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలను కోరుతున్నట్లు తెలిపారు.

### ఆలయంలో ధ్వజారోహణం

ఎడపల్లి(బోధన్): జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

# పొగాకు బట్టీలతో అస్వస్థత!

- పొగతో మసకబారుతున్న బతుకులు
- అవగాహన కల్పించని కంపెనీలు, వ్యవసాయ శాఖ



బోర్గాం శివారులో వెలసిన పొగాకు బట్టీలు

రెంజల్(బోధన్): జనావాసాల మధ్య పొగాకు బట్టీల ఏర్పాటుతో వృద్ధులు, చిన్న పిల్లలు అస్వస్థతకు గురవుతున్నారు. అవగాహన కల్పించాల్సిన కొనుగోలు కంపెనీలు వ్యాపార దృక్పథంతో పంటల సాగును ప్రోత్సహిస్తుండగా, వ్యవసాయ శాఖ అధికారులు పంటల నమోదుతోనే సరిపెడుతున్నారు. దీంతో పొగాకు బట్టీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో స్థానికుల బతుకులు పొగచూరుతున్నాయి. పొగాకును ఉమ్మడి జిల్లాతో పాటు సరిహద్దున గల మహారాష్ట్రలో అత్యధికంగా రైతులు సాగు చేస్తారు. రెంజల్, బోధన్, బాన్సువాడ, మద్నూర్, పిట్లం మండలాల్లో పొగాకు పంటను రైతులు విరివిగా సాగు చేస్తారు.

**విదేశాలకు మన పొగాకు**

ఉమ్మడి జిల్లాలో రైతులు పండించిన పొగాకును కొనుగోలు చేసిన కంపెనీలు విదేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. ప్రధానంగా గుంటూరు, హైదరాబాద్ కేంద్రాలుగా పలు కంపెనీలు పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేస్తాయి. వజీర్ సుల్తాన్ టొబాకో(వీఎస్‌టీ)తో పాటు ఐటీసీ, పీటీపీ కంపెనీలు పోటీ పడి రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. ముందు నుంచి రైతులతో అవినాభావ సంబంధం అధికంగా ఉన్న వీఎస్‌టీకే ఇక్కడి రైతులు విక్రయిస్తారు. వారు ముందుగా రైతులతో ఒప్పందం చేసుకుని పొగాకును రైతుల నుంచి సేకరిస్తారు.

**వారు నిర్ణయించిందే ధర**

రైతులతో ముందుగానే ఒప్పందం చేసుకున్న వీఎస్‌టీ కంపెనీ నిర్ణయించిన ధరకే రైతులు పొగాకును విక్రయించాల్సి ఉంటుంది. సంవత్సరంలో ఆరు నెలల పాటు శ్రమించి పండించిన పంటను అమ్ముకోవాలన్నా కంపెనీ నిర్ణయం మీదనే ఆధారపడాల్సి ఉంటుంది. పొగాకును పండించడం ఒక ఎత్తయితే దాన్ని బట్టీల్లో కాల్చడం తలకు మించిన భారం అవుతుంది. ఏ చిన్న పొరపాటు జరిగినా ఆరు నెలల శ్రమ వృథా అవుతుంది. రాత్రింబవళ్లు బట్టీల వద్దనే రైతులు నిద్రాహారాలు మాని పని చేయాల్సి ఉంటుంది.

**రోగాల బారిన ప్రజలు**



కందకుర్తిలో జనావాసాల మధ్య..

నాలుగు నెలలు పండించిన పొగాకును రైతులు జనావాసాల మధ్య బట్టీలను ఏర్పాటు చేసి పొగ పెట్టడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పొగ కాలుష్యం గ్రామాలను విస్తరించడంతో ఊపిరాడక దగ్గు, దమ్ముతో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఆయా గ్రామాల్లో ఇప్పటికే చిన్న పిల్లలు, వృద్ధులు క్యాన్సర్‌తో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. ఊరి చివర పొగాకు బట్టీలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# సౌకర్యాలు లేక విలవిల



వ్యవసాయ పొలాల వద్ద సేదతీరుతున్న భక్తులు



చెరువు వద్ద స్నానం చేస్తూ..

- బడాపహాడ్ ఉత్సవాల్లో భక్తులకు ఇక్కట్లు

వర్ని: బడాపహాడ్‌లో ఉరుసుకు వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఉండటానికి షెల్టర్లు, స్నానం చేయటానికి బాత్రూములు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అధికారులు నరకాన్ని చూపించారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు, అధిక ధరలు, దర్గా వద్ద భక్తుల వద్ద బలవంతపు వసూళ్లు చేశారు. భక్తులకు స్నానం చేయడానికి ఏర్పాట్లు చేయకపోవడంతో కాలువలు, చెరువులు, వాగుల్లో స్నానం చేసి మమ అనిపించుకున్నారు. షెడ్లు, టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అటవీ ప్రాంతాల్లో, వ్యవసాయ పొలాల వద్ద భక్తులు సేద తీరారు. భక్తులు అంతంత మాత్రమే వచ్చారు.

# బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చందూర్‌లో మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

- బాన్సువాడలో బీజేపీ విజయం తథ్యం
- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

రుద్రూర్(చందూర్) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. చందూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ కార్యకర్తల సమిష్టి కృషితో వచ్చే సాధారణ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి యువతను మోసం చేశారని, రుణమాఫీ హామీతో రైతులను నమ్మించి ఇప్పుడు ముఖం చాటేశారని విమర్శించారు. సమావేశంలో బాన్సువాడ సెగ్మెంట్ బీజేపీ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, కో–కన్వీనర్ భూపాల్ రెడ్డి, సంఘటన కార్యదర్శి మహేష్, చందూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు నీలి హరీష్, శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు గణేష్ సింగ్, పాల్దె శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు సాహిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 'కేంద్రం విద్యా రంగాన్ని విస్మరించింది'



బడ్జెట్ పత్రాలను తగలబెడుతున్న నేతలు

ఆర్మూర్‌టౌన్: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ ఆర్మూర్ మండల ఉపాధ్యక్షురాలు మమతా విమర్శించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడ్జెట్లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినప్పటికి 5 శాతం నిధులు కూడా కేటాయించలేదని మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజలి, చోటు, రసజ్ఞ, హరిణి, తదితరులు పాల్గొన్నారు.

**పేదలు, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం**

బోధన్‌రూరల్(బోధన్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం చేసిందని పెట్టుబడిదారులు, వ్యాపారులకు లబ్ధిచేకూరేలా నిధులు కేటాయించడం సరికాదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యేశాల గంగాధర్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా గురువారం పెంటాకుర్దులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, వికలాంగుల హక్కుల సంఘం, కుల వివక్ష వ్యతిరేక సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు.

**బడ్జెట్‌పై కేవీపీఎస్ నిరసన**

మాక్లూర్: పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. దళిత వర్గాలు, కార్మిక వర్గాలకు విరుద్ధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని మండిపడ్డారు. దేశంలో 20 శాతం దళిత వర్గాలు ఉండగా బడ్జెట్‌లో 16 శాతమే కేటాయించటం విచారకరమన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కొండ గంగాధర్, బీఎస్పీ నాయకుడు పద్మారావు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు



బోధన్: ప్రత్యేక జిల్లా ఏర్పాటు డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 46వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ బిల్డింగ్ సెంట్రింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు లతీఫ్, అజీమ్, జావిద్, రాజు, గంగాధర్, నాసిర్, చావూస్ కూర్చున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు హన్మంత్‌రావు, అడ్లూరి శ్రీనివాస్‌లు దీక్షలను ప్రారంభించారు.

### సీసీ రోడ్ల మంజూరుపై హర్షం



మాక్లూర్: అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం వారి స్వగృహంలో కల్సి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్టు జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తెలిపారు. తన స్వగ్రామమైన మాక్లూర్ మండలం వెంకటాపూర్‌లో సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని కవిత దృష్టికి తీసుకెళ్లిన కొద్ది రోజులకే నిధులు మంజూరు చేయటంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారన్నారు.

# సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్



మోస్రా పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

రుద్రూర్: అసెంబ్లీలో ఆశావర్కర్ల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ గురువారం మోస్రా పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, ఎన్ఆర్ హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లుగా రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, సీపీఎం మోస్రా మండల కార్యదర్శి మేకల మల్లేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సమాచారంలోపంతో అయోమయం!

- రీడింగ్ అద్దాలనే ఇస్తున్నారు.. మరి ప్రిస్క్రైబ్డ్ అద్దాలు ఇచ్చేదెప్పుడు ?
- కంటి వెలుగు కార్యక్రమంపై కోటగిరి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల సందేహాలు



కోటగిరిలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ కృష్ణ

కోటగిరి : ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్నప్పటికీ సామాన్య ప్రజలు తమకు అందే వివిధ రకాల అద్దాల పంపిణీకి సంబంధించిన సమాచారం తెలియక అయోమయానికి గురౌతున్నారని ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఇచ్చిన అద్దాలు వాడకుండా పక్కన పెడ్తున్నారని తెలియజేశారు. గురువారం కోటగిరి, పోతంగల్ ఉభయ మండలాల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వల్లేపల్లి సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ.. కంటి చూపు సమస్యలున్న వారికి రీడింగ్ గ్లాసులను ఇవ్వడంతో కేవలం దగ్గరి వస్తువులను చూడటం మాత్రమే సాధ్యమవుతోందని, బయటకు వెళ్లేటప్పుడు పనికి రావడం లేదని చెప్పారు. అలాంటప్పుడు తిరిగి వీరికి మరోసారి ప్రిస్క్రైబ్డ్ కంటి అద్దాలను ఎప్పుడు అందజేస్తారో తెలియక సతమతమౌతున్నారని పేర్కొన్నారు. సరైన సమాచారాన్ని అందించడానికి క్షేత్ర స్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది మరింత చొరవ చూపాలని సర్పంచ్ పత్తి లక్ష్మణ్, ఎంపీటీసీ కొట్టం మనోహర్ విజ్ఞప్తి చేశారు.

**అద్దాలు రాగానే పంపిణీ చేస్తాం**

ప్రిస్క్రైబ్డ్ అద్దాలు అందగానే పంపిణీ చేస్తామని హెల్త్ సూపర్ వైజర్ కృష్ణవేణి వెల్లడించారు. గతంలో కరోనా సోకిన ప్రతి ఒక్కరు స్థానిక సబ్ సెంటర్లలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోటగిరిలోని పోచారం కాలనీ, డబుల్ బెడ్రూమ్ కాలనీలకు విద్యుత్ లైన్లు లాగాలని సర్పంచ్ పత్తి లక్ష్మణ్ కోరగా.. అందుకు అవసరమైన డబ్బును సంస్థకు చెల్లించాలని ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. సమావేశంలో పోతంగల్ తహసీల్దార్ రమేష్, ఎండీవో మనోహర్ రెడ్డి, డాక్టర్ సుప్రియ, ఏఎంసీ చైర్మన్ హమీద్ పాల్గొన్నారు.

### రెండో రోజు సాగిన క్రీడలు

బోధన్‌టౌన్(బోధన్): ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడలు రెండో రోజు కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర జట్టు విజేతగా నిలిచిందని, విద్యార్థినులకు నిర్వహించిన కబడ్డీ పోటీల్లో టీఎస్ఆర్‌జేసీ (ఎడపల్లి) విజేతగా నిలిచిందని డిగ్రీ కళాశాల అధ్యాపకులు తెలిపారు.

**వంట పాత్రల బహూకరణ**

కోటగిరి: పోతంగల్ మండలం కల్లూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ కార్మికులకు గురువారం వంట పాత్రలు అందజేశారు. గ్రామ పెద్దలు, దాతలు, టీచర్ల విరాళాలతో వంట పాత్రలను కొనుగోలు చేశారు.స్థానిక ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

### శిక్షణ శిబిరం ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు పాఠశాలలో 41వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు.

**బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు**

రుద్రూర్: మండల కేంద్రంలోని దేవివాస్‌రావ్ గోశాలలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో 4 నెలల నుంచి 8 నెలల వయస్సు గల గేదెలు, 70 ఆడ దూడలకు టీకాలు వేశారు.

### అండగా నిలవడం అభినందనీయం



ఆర్మూర్‌టౌన్: అనారోగ్యానికి గురైన వృద్ధురాలిని మానవత్వంతో అండగా నిలుస్తున్న ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నసీమా సుల్తానా అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో కొన్ని రోజులుగా అనాథ వృద్ధురాలు కంటి చూపుపోయి ఆరోగ్యం క్షీణించి దయనీయ స్థితిలో కాలం వెల్లదీస్తోంది. ఇది గమనించిన సంస్థ సభ్యులు వృద్ధురాలిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడానికి ముందుకు వచ్చారు. అలాగే ఆరోగ్యం మెరుగయ్యాక వృద్ధాశ్రమంలో చేర్పించనున్నారు. దీంతో సంస్థ సభ్యులను న్యాయమూర్తి అభినందించారు.

## సమాచారం..

### రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

వేల్పూర్: మండలంలో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో కమలాకర్‌రావు గురువారం తెలిపారు. 3 యూనిట్ల కోసం 120 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఉదయం 11 గంటలకు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

### అంబం(ఆర్)లో టీకాలు

రుద్రూర్: అంబం(ఆర్)లో శుక్రవారం ఉదయం గేదెలు, ఆవు దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు మండల పశువైద్యాధికారి సంతోష్ రెడ్డి తెలిపారు. 4 నెలల నుంచి 8 నెలల వయస్సు గల గేదె జాతి, ఆవు జాతి దూడలకు టీకాలు వేయించాలని రైతులకు కోరారు.

### 5న ఉచిత హెల్త్ క్యాంప్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఈ నెల 5న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఏసీడీతో ప్రజలపై అదనపు భారం



ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ పేరుతో వినియోగదారుల నుంచి అదనపు చార్జీలను వసూలు చేయడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఈకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. తెలంగాణ ధనిక రాష్ట్రమని, దేశానికి స్ఫూర్తి అని చెబుతూ మరో వైపు ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. విద్యుత్ సంస్థలకు బకాయలు చెల్లించకపోగా ఏసీడీ పేరుతో వసూలు చేయడం దుర్మార్గమని అన్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ, ఐఎఫ్‌టీయూ నాయకులు పోశెట్టి, చిట్టిబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయండి



బోధన్‌రూరల్(బోధన్): ఆరుతడి పంటల సాగు కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంట్ కోతలు లేకుండా సరఫరా చేయాలని హున్స, ఖాజాపూర్, మందర్న రైతులు కోరారు. ఈ మేరకు గురువారం ఖాజాపూర్‌లో విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

### వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం



మాక్లూర్: ముల్లంగి(బి)లోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీలు సంయుక్తంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎతున్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించటానికి శివారు గ్రామాలైన బొంకన్‌పల్లి, శాంతినగర్, ముల్లంగి, మాదాపూర్, గంగరమంద, గొట్టిముక్కల, మాక్లూర్‌కు చెందిన ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు.

### యూరియా కోసం ఆందోళన వద్దు

- సరిపడా నిల్వలు ఉన్నాయి: ఏడీఏ మల్లయ్య

భీమ్‌గల్: రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని ఏడీఏ మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ..మొత్తం 350 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. రైతులు యూరియా అడిగినప్పుడు ఇవ్వాలని, లేని పక్షంలో ఎఫ్‌సీవో యాక్ట్ ప్రకారం లైసెన్స్ రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. ఏవో సాయి కృష్ణ, ఏఈవో లక్‌పతి ఉన్నారు.

